నాడు నిర్లక్ష్యం.. నేడు ప్రగతి పథం



నేడు - జొన్నగిరి ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



నాడు - బురదమయంగా ఉన్న రోడ్డు

తుగ్గలి: మండలంలోనే పెద్ద గ్రామం. అయినా గత ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యం చూపింది. దశాబ్దాలుగా జొన్నగిరి చెరువు కట్ట నుంచి ఎస్సీ కాలనీ వైపు వెళ్లే మట్టి రోడ్డులో జనం అవస్థలు పడ్డారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ సీసీ రోడ్డు నిర్మిస్తామని నాయకులు హామీ ఇస్తారు. గెలిచాక పట్టించుకోరు. ఓట్ల కోసం హామీ ఇవ్వడం. ఆ తర్వాత విస్మరించడం ఇన్నేళ్లు జరిగింది. మట్టి రోడ్డులో ఈ మార్గం గుండా వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నా గత పాలకులు పట్టించుకోలేదు. ఈ రోడ్డు గుండా స్థానికులే కాకుండా పగిడి రాయి, చెన్నంపల్లి, పీ.కొత్తూరు, కడమకుంట్ల, ఉసేనాపురం, రామలింగాయపల్లి ప్రజలు నిత్యం జొన్నగిరి, గుత్తికి ప్రయాణం సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ రోడ్డు వెంట నడిచేందుకు కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పలుమార్లు పాలకులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సీసీ రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు. సాంకేతిక కారణాలతో పాటు పలు సమస్యలు తలెత్తాయి. రోడ్డు నిర్మాణానికి పలువురు అడ్డంకులు సైతం సృష్టించారు. వీళ్లేం రోడ్డు వేస్తారని విమర్శించిన వాళ్లు ఉన్నారు. అయినా వాటన్నింటినీ అధిగమించి ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.33 లక్షలతో 550 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో కాలనీ వాసులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇబ్బందులు తొలగాయి



ఇన్నేళ్లు సీసీ రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. చిన్నపాటి చినుకులు పడినా రోడ్డంతా బురదమయంగా మారి నడిచేందుకు కూడా కష్టంగా ఉండేది. కొంతమంది జారి పడ్డారు కూడా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మించి మా ఇబ్బందులు తొలగించింది. రోడ్డు నిర్మించడంతో ఎంతో మందికి ఉపయోగం కలిగింది.

– రామచంద్ర, జొన్నగిరి

కాలనీకి మహర్దశ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పుణ్యమా అని మా కాలనీకి మహర్దశ కలిగింది. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న ప్రధాన రోడ్డు ఇప్పుడు సీసీ రోడ్డుగా మారింది. గతంలో ఎంతో మంది నాయకులు, అధికారులను అడిగినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎమ్మెల్యే శ్రీదేవి ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు వేయించారు. చాలా సంతోషంగా ఉంది.

– మురళీ, 5వ వార్డు సభ్యుడు, జొన్నగిరి

ఎమ్మెల్యే చొరవతో పరిష్కారం



ఎన్నో ఏళ్ల సమస్య ఇన్నాళ్లకు పరిష్కారమైంది. ఈ మార్గం గుండా మా కాలనీ వాసులే కాకుండా పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు నిర్మాణంతో వారందరికీ సౌకర్యంగా మారింది. గతంలో ఎవరూ పట్టించుకోని సమస్యను ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. జగనన్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

– సుంకప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



చిన్నహోతూరులో భగవద్గీతను అందజేస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో ఆదివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రబోధ సేవా సమితి గుత్తి, ఎనుగుమర్రి, జొన్నగిరి, తుగ్గలి కమిటీ అధ్యక్షులు రవికుమార్, మోహన్‌కృష్ణ, దేవేంద్ర, చంద్రశేఖర్‌తో పాటు సభ్యులు ప్రచారం చేశారు. వీరు ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్తులకు భగవద్గీత గురించి వివరించారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత గ్రంథంపై ప్రచారం నిర్వహించారు. వేదిక సభ్యులు సురేష్, భాస్కర్, వీరేష్, మోహన్ మాట్లాడుతూ రాబోవు ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండగల విశిష్టతను తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు గ్రామాల్లో సామాజిక తనిఖీ సభలు

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్ల, పగిడిరాయి, జీఎర్రగుడి గ్రామాల్లో ఆదివారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించా రు. క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల తనిఖీల్లో గుర్తించిన అంశాలను డీఆర్పీలు గ్రామ సభల్లో చదివి వినిపించారు. ఈసీ ప్రదీప్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



మారెల్లలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తుగ్గలి: క్రీడలతో శారీరక దృఢత్వం పొందవచ్చని బీసీవై పార్టీ నాయకులు కౌలుట్ల యాదవ్, మిద్దె వెంకటేశ్వర్లుయాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మారెల్లలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును వారు ఆదివారం ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన జట్లకు వరుసగా మిద్దె వెంకటేశ్వర్లుయాదవ్ రూ.50 వేలు, నరేష్‌గౌడ్ రూ.30 వేలు, వెంకటేష్‌గౌడ్ రూ.20 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు రాముడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకరరెడ్డి, లింగన్న, ఘనమద్దిలేటి పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



రామలింగప్ప (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వెల్దుర్తికి చెందిన కురువ రామ లింగప్ప (55) కర్నూ లు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. స్థానిక పాత బస్టాండులో తోపుడు బండిపై పొంగనాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే రామలింగప్ప చికిత్స కోసం పట్టణంలోని పలువురు ఆర్థిక సాయం చేసినప్పటికీ ప్రాణాలు నిలువలేదు. ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి రామలింగప్ప మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

జయప్రదం చేయండి



వాల్మీకి యువ గర్జన పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరురూరల్: ఎస్టీ రిజర్వేషన్ సాధనకు ఈనెల 20న కర్నూలులో జరిగే వాల్మీకి యువగర్జన సభను జయప్రదం చేయాలని వాల్మీకి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేష శ్రీనివాసులు, జిల్లా నాయకులు రంగమునినాయుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని జోగులాంబ దేవాలయం వద్ద యువగర్జనపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వాల్మీకి సంఘం నాయకులు వీజీఆర్ కొండయ్య, చిన్న ఈరన్న, బీఆర్ రామకృష్ణ, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిపై వేటు

ఎమ్మిగనూరురూరల్: వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బిసి.నాగరాజును ఆ పదవి నుంచి తొలగించినట్లు వీహెచ్‌పీఎస్ తాలుకా అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కోర్ కమిటీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్ష పదవి నుంచి నాగరాజును తొలగించినట్లు చెప్పారు. వీహెచ్‌పీఎస్‌కు వ్యతిరేకంగా సమావేశాలు పెట్టడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి పెద్దయ్య, టౌన్ అధ్యక్షులు రఘువీరా, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగశేషమ్మ, రాష్ట్ర సమన్వయకర్త బిసి. సోమన్న పాల్గొన్నారు.

10న వేలంపాట

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 10వ తేదీ బుధవారం 11 గంటలకు తలనీలాల వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు తలనీలాలు పోగు చేసుకునే హక్కులు పొందేందుకు ఆసక్తిగల వారు లక్ష రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

తుగ్గలి: అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం జొన్నగిరిలో రెండోరోజు ఆదివారం కొనసాగింది. రామభక్తులు గిడ్డయ్య, ఉమామహేశ్వర ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని ఈ నెల 22వ తేదీ ప్రతి ఇంట్లో స్వామి వారికి పూజలు చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

ఆలూరు: మండలంలోని మొలగవెల్లి గ్రామానికి చెందిన దేవగట్టి మారెన్న కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక వీఆర్పీఎస్ నాయకుడు రామాంజనేయులు పంచాయతీరాజ్ వింగ్ ఉమ్మడి జిల్లాల జోనల్ అధ్యక్షుడు, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఆయన రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి దేవగట్టి మారెన్నకు నగదు అందజేశారు. ఈ మేరకు ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తెల్లారకముందే పింఛన్ల పంపిణీ



మద్దిలింగదహళ్లిలో వృద్ధురాలు మల్లమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్



కర్నూలులో చికిత్స పొందుతున్న అల్లిపీరాకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సోమశేఖర్

హొళగుంద: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో వలంటీర్లు ఆదివారం తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.3 వేల పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 6,159 పింఛనుదారులుండగా ఇప్పటివరకు 5,800 మందికి పంపిణీ చేసి 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు. గత పాలనలో పీడకల లాంటి పింఛన్ల పంపిణీ ప్రక్రియకు స్వస్తి పలికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము అందిస్తుండడంతో హర్షం వ్యక్తమవుతోంది.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

ఆలూరు రూరల్: పట్టణంలోని కోయనగర్ కాలనీకి చెందిన అల్లిపీరా అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సోమశేఖర్ ఆదివారం కర్నూలుకు వెళ్లి రూ.3 వేల పింఛన్ నగదు అందజేశాడు. మానవత్వం చాటి పింఛన్ అందించిన వలంటీర్‌కు అల్లిపీరా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

కృష్ణగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఆర్‌బీ వెంకట్రాముడు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మద్దికెర: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, మండల కన్వీనర్ గంపల వెంకటేశులు ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బస్టాండు వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని లబ్ధిదారులు హాజరు కావాలన్నారు.

కంది పంటకు నిప్పు

మద్దికెర: మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మల్లేష్ అనే వ్యక్తికి చెందిన నాలుగెకరాల కంది పంట దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మల్లేష్ మద్దికెర - బొజ్జనాయునిపేట రహదారిలో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని కంది పంటను సాగు చేశాడు. పంటను కోసి పొలంలో ఉంచాడు. ఆదివారం ఉదయం నూర్పిడి యంత్రం ఆడించుకుందామనుకునేలోపే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమై 2 లక్షల వరకు నష్టపోయినట్లు వాపోయాడు. ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

క్రీడాకారులు సత్తా చాటాలి

ఎమ్మిగనూరుటౌన్: క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు టోర్నమెంట్‌లు ఉపయోగపడతాయని స్థానిక 14వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఖాశీంబేగ్ సూచించారు. పట్టణంలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఏఆర్ టీమ్‌పై కౌలు లెవెన్స్ టీమ్ గెలుపొందింది. ఈ జట్టులో ప్రతిభ చాటిన యువరాజు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ సయ్యద్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పత్తికొండలో వైఎస్సార్‌సీపీ సమావేశం

తుగ్గలి: పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పైలాన్ ఆవిష్కరణ



పత్తికొండ జూనియర్ కాలేజీలో పైలాన్ ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పత్తికొండ రూరల్: పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 50 వసంతాల వేడుక పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు పైలాన్‌ను ఆవిష్కరించారు. కాలేజీ ఆవరణలో ప్రిన్సిపాల్ వీరేశప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన ప్రముఖులు హాజరయ్యారు. వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు, 1971లో కళాశాల ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కళాశాల ప్రస్థానాన్ని గురించి ప్రచురించిన సావనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. స్నేహితులతో ఆత్మీయంగా గడిపారు.

అందుబాటులో లేని వైద్య సిబ్బంది



దేవనకొండ పీహెచ్‌సీలో సిబ్బంది లేకపోవడంతో బాధితుడి బంధువులే ప్రథమ చికిత్స చేస్తున్న దృశ్యం

దేవనకొండ: స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రానికి చెందిన రాము అనే వ్యక్తిపై ఎద్దుల బండి పోవడంతో ఊపిరి అందక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆ వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రికి ఆదివారం రాత్రి 7:30 గంటల సమయంలో తీసుకువచ్చారు. ఒకే ఒక స్టాఫ్ నర్స్ తప్పా వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. దాదాపు గంటన్నర వరకు ఎలాంటి ప్రాథమిక చికిత్స కూడా చేయకపోవడంతో పేషెంట్ నరక యాతన అనుభవించాడు. తర్వాత అంబులెన్స్ రావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారులు చర్యలు చేపట్టి 24 గంటలూ వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



ఎల్లార్తిలో మాట్లాడుతున్న కురువ నేత శశికళ దంపతులు

హొళగుంద: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు కురువలకు ప్రాధాన్యత ఇవ్వాలని బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ డిమాండ్ చేశారు. ఆదివారం భర్త కృష్ణమోహన్‌తో కలిసి ఎల్లార్తికి వచ్చిన ఆమె కురువ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు కురువలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్పా మేలు చేసింది లేదన్నారు. అలాంటి నాయకులకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కురువలను ఎస్సీ జాబితాలో చేర్చి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కురువ సంఘం నాయకులు కోగిలతోట శేషప్ప, దర్గన్న, పెద్యాట మల్లయ్య, ఎస్కే గిరి, గర్జప్ప, రవి, మహేశ్ తదితరులు ఉన్నారు.

హాలహర్వి: జిల్లా కేంద్రంలోని పంచలింగాల నాగరాజు ఫామ్‌హౌస్‌లో ఆదివారం మాదాసి, మాదారి కురువ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. 14 సంఘాల ముఖ్య నాయకులు హాజరయ్యారు. అన్ని సంఘాల ఆమోదంతో కుల సంఘాల పొలిటికల్ జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా రవికుమార్‌ను ఎన్నుకున్నారు. అలాగే 14 సంఘాల నుంచి ఒక్కొక్కరిని కో-కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఆలూరు తాలూకా ఉపాధ్యక్షుడిగా ఉన్న నిట్రవట్టి బసవరాజును కర్నూలు జిల్లా పొలిటికల్ జేఏసీ కో-కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఆయన సారథ్యంలో కురువల సమస్యలపై పోరాడతామని సభ్యులు పేర్కొన్నారు.

విత్తన డీలర్లకు శిక్షణ



విత్తన శుద్ధి పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ సహకారంతో 'ఆత్మా' ద్వారా కర్నూలు జిల్లాలో ఎంపికచేసిన 40 మంది ఎరువులు, పురుగు మందుల డీలర్లకు ఆదివారం రామళ్లకోట ఆర్బీకేలో, క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ (డీఏఈఎస్ఐ)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్ జేడీఏ డి.జయచంద్ర, వెల్దుర్తి ఏఓ అక్బర్‌బాషా ఆర్బీకేల సేవలను వివరించారు. రైతుల అభ్యున్నతికి, పంటల దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేరుశనగ, ఉల్లి, జొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ చీడపీడలపై, వాటి నివారణకు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. పురుగు మందుల పిచికారీలో రైతులకు కల్పించాల్సిన అవగాహన, విత్తన శుద్ధి ఆవశ్యకతపై ప్రయోగాత్మకంగా చూపారు. వీహెచ్‌ఏ సాంబశివుడు, వివిధ మండలాల డీలర్లు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సోదరుని అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో రాము అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పోతుల సునీత, సురేష్ దంపతులు

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో హత్యకు గురైన పూజారి రాము అంత్యక్రియలను కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించారు. అంత్యక్రియల్లో మృతుడి సోదరి ఎమ్మెల్సీ పోతుల సునీత, సురేష్ దంపతులు పాల్గొన్నారు. ఘటనకు సంబంధించి ఎమ్మెల్సీ సునీత లెనిన్‌బాబును అడిగి తెలుసుకున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



నందవరం మాలగేరిలో నిర్మించిన సీసీ రోడ్డు

నందవరం: గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆదివారం మండల కేంద్రంలోని మాలగేరిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. మేజర్ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన జీజీఎంపీ నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామంలో మాలగేరిలో రూ.5 లక్షలు, కొత్త బీసీ కాలనీలో మూడు వర్కులకు రూ.15 లక్షల నిధులతో పనులు చేపట్టారు. ట్యాంకు వద్ద పాత బీసీ కాలనీలో, గిర్ని రోడ్డులో సీసీ రోడ్లు పూర్తి చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయని పీఆర్ అధికారులు చెబుతున్నారు.

టీబీ డ్యాంలో అడుగంటిన నీరు



తుంగభద్ర జలాశయంలో అడుగంటిన నీరు

హొళగుంద: ఉమ్మడి జలాశయం, కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో ఆదివారం 10.229 టీఎంసీల (పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో జీరో ఉండగా 1589 అడుగుల వరకు నీరు ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 1623.18 అడుగుల వద్ద 70.702 టీఎంసీల నీటితో జలాశయం కళకళలాడుతుండేది

ఫిబ్రవరిలో ఎల్లెల్సీకి నీరు ?

టీబీ డ్యాంలో నీటి నిల్వ పడిపోవడంతో బోర్డు అధికారులు తాగునీటి అవసరాలకు గాను డిసెంబర్ 25న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీటి సరఫరా నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో కర్ణాటక, ఏపీ ప్రజల తాగునీటి అవసరాలకు తిరిగి ఈ నెలఖారు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో 10 రోజుల పాటు తాగునీటిని వదిలే అవకాశాలున్నట్లు బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ఆ తరువాత మళ్లీ బంద్ చేయనున్నారు. ఈ మధ్యలో ఇరు రాష్ట్రాల అధికారులు చెరువులను నింపుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం డ్యాంలో మిగిలి ఉన్న 10 టీఎంసీల నీటిని వేసవి కాలం ముగిసే వరకు వాడుకోవాల్సి ఉంటుంది.

గ్రామాల్లో వికసిత్ యాత్ర



పెద్దకొత్తిలిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొన్న మండల అధికారులు

నందవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఎంపీడీఓ దశరథ రామయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నె, పెద్దకొత్తిలి గ్రామాల్లో సర్పంచులు తెలుగు లక్ష్మి, బైటిగేరి శివన్న ఆధ్వర్యంలో మండలాధికారులు 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను పేదల కోసం ప్రవేశపెట్టిందన్నారు. వాటిని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీల గురించి వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, మందుల పిచికారీ గురించి వివరించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్లలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కార్తీక్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అ'పూర్వ' కలయిక



వెల్దుర్తిలో కొళాయిలను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు, అతిథులు



గుడేకల్‌లో గురువుతో పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏటా జనవరి నెలమొదటి ఆదివారం వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదర్శంగా నిలుస్తోంది. హైస్కూల్ ప్రారంభమైన మొట్టమొదటి ఎస్ఎస్ఎల్సీ బ్యాచ్-1958 నుంచి నిన్నటి సంవత్సరం వరకు చదివిన అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఆదివారం స్థానిక బాలికల హైస్కూల్‌లో సందడిగా సాగింది. సంఘం అధ్యక్షుడు వావిలాల కృష్ణమూర్తి (1967 బ్యాచ్) అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా సాగింది. వృత్తి, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఏ స్థాయిలో ఉన్నా, విశ్రాంత జీవనం గడుపుతున్నా వయసుతో తేడా లేకుండా తామంతా పాఠశాల పూర్వ విద్యార్థులమే అంటూ ఒక్కచోట చేరిన వారి ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలు, మధుర జ్ఞాపకాలు, బాల్యస్మృతులతో పండుగ వాతావరణం నెలకొంది. విశిష్ట అతిథులుగా హాజరైన విశ్రాంత గురువులు శంకరయ్య, బోయన పల్లె కృష్ణమోహన్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సేవా సంఘం ఆధ్వర్యంలో బాలికల హైస్కూల్‌లో నిర్మించిన వాటర్ ట్యాంక్‌లను, నీటి కుళాయిలను ప్రారంభించారు. హెచ్‌ఎం చంద్రావతి మాట్లాడారు. అలనాటి గురువుల ఫొటోలతో కూడిన క్యాలెండర్లు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఆత్మీయ విందు ఆరగించారు. సంఘం ప్రతినిధులు రవి, లక్ష్మణ్, కాంతారెడ్డి, ఖాజాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో 1981-1982 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువు సోమప్పను ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు.

మద్దికెర: మిత్రమా కుశలమా అంటూ 2001-02లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు పాల్గొని ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



మద్దికెరలో అలనాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు